
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 29 । జనవరి । 2023



69.723 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 69.723 టీఎంసీలు ఉన్నాయి. 1037 క్యూసెక్కుల వరద వస్తుండగా పెన్నార్ డెల్టాకు 2,520, ఉత్తర కాలువకు 650, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.59,000
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,270
3 శాతం జీఎస్టీతో	రూ.5,428
నవర (8 గ్రా)	రూ.43,424

గరిష్టం/కనిష్టం 31.0 /21.2

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఆకాశం అక్కడక్కడ మేఘావృతంగా ఉంటుంది. చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ 60 శాతం ఉంది.

చిట్టి మెదళ్లు... విజ్ఞాన పుంతలు

- విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయొచ్చు
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- అట్టహాసంగా జిల్లా సైన్స్ ఫెయిర్ ప్రారంభం

నెల్లూరు (టౌన్): వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయొచ్చని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పొదలకూరురోడ్డులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను కలెక్టర్ చక్రధర్‌బాబు, మేయర్ స్రవంతితో కలిసి మంత్రి కాకాణి ప్రారంభించారు. విద్యార్థులు మంత్రి కాకాణికి అపూర్వ స్వాగతం పలికారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలస్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ సైన్స్‌కు సంబంధించి పరిశోధనలు విస్తృతంగా జరగాలని చెప్పారు. పరిశోధనల వల్ల కలిగే ప్రయోజనాలు మానవాళికి అందాలని, ఆ దిశగా సరికొత్త ఆవిష్కరణలకు విద్యార్థి దశ నుంచే ప్రారంభించాలన్నారు. ఆధునిక సాంకేతిక రంగాల్లో దేశం అద్భుత ఫలితాలు సాధిస్తోందని, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు వాతావరణ కాలుష్యం కూడా ఎక్కువవుతుందన్నారు. కలుషితమైన వాతావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. సైన్స్ ఫెయిర్‌లో మొక్కుబడిగా కాకుండా ఆసక్తి, ఉత్సాహంగా పాల్గొని సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలికే దిశగా అడుగులు వేయాలన్నారు. ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చారని, నాడు–నేడు పథకంతో పాఠశాలల రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయన్నారు. అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, గోరుముద్ద, ట్యాబ్‌లు పంపిణీ వంటి అనేక కార్యక్రమాలతో విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యావ్యవస్థ గురించి ఇంత గొప్పగా ఆలోచన చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. కలెక్టర్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ కొన్ని వేల సంవత్సరాల క్రితమే భారతదేశంలో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉందన్నారు. ఇతర దేశాల కంటే మన దేశం ఏ మాత్రం తక్కువ కాదని, అన్ని రంగాల్లో మన దేశం అభివృద్ధి పథంలో ముందుందన్నారు. సైన్స్ ఫెయిర్‌లో బహుమతులు పొందడం కంటే పాల్గొనడమే ముఖ్యమన్నారు. రోజు వారీ మానవ జీవితంలో సైన్స్ చాలా కీలక పాత్ర పోషిస్తోందని, సైన్స్ గొప్పతనాన్ని తెలుసుకుని విద్యార్థులందరూ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు.



ప్రాజెక్ట్ నమూనాలను పరిశీలిస్తున్న మంత్రి కాకాణి, కలెక్టర్ చక్రధర్‌బాబు తదితరులు

ప్రాజెక్ట్‌ల నమూనాల పరిశీలన

పాఠశాలలో ఏర్పాటు చేసిన 186 ప్రాజెక్ట్‌ల నమూనాలను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రాజెక్ట్‌లు రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపిక కానున్నాయి. తొలుత సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, ఆర్జేడీ సుబ్బారావు, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, విద్యాశాఖ డిప్యూటీ డీఈఓలు, ఏడీలు, పాఠశాల హెడ్‌మాస్టరు జయమ్మ, వివిధ పాఠశాలల విద్యార్థులు, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు 60 వేల మంది కూలీలు

- డ్వామా పీడీ వెంకట్రావ్

నెల్లూరు (పొగతోట): ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను 60 వేలకు పెంచేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ వెంకటరావు మండల అధికారులను ఆదేశించారు. శనివారం డ్వామా కార్యాలయం నుంచి మండలాల ఎంపీడీఓలు, ఏపీడీలు, ఏపీఓలు, ఈసీలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో పీడీ మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 1.15 కోట్ల పనిదినాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఇప్పటి వరకు 87 లక్షల పనిదినాలు కల్పించామన్నారు. కూలీలకు పేమెంట్లు సకాలంలో వారి బ్యాంకు అకౌంట్లకు జమవుతాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి కూలీల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆధార్ అనుసంధానం వంద శాతం పూర్తి చేయాలన్నారు. నూతన విధానంలో పనులకు హాజరయ్యే కూలీల ఫొటోలను అప్‌లోడ్ చేయాలని తెలిపారు.

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్

- 118 గ్రామాల్లో రీసర్వే పూర్తి
- 124 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- జేసీ రోణంకి కూర్మనాథ్



జేసీ ఆర్ కూర్మనాథ్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష రీసర్వే ప్రక్రియ ద్వారా భూసమస్యలకు చెక్ పెట్టవచ్చునని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ అన్నారు. శనివారం జేసీ సాక్షి ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 735 గ్రామాల్లో రీసర్వే జరుగుతోందన్నారు. మొదటి దశలో 118 గ్రామాల్లో 2.20 లక్షల ఎకరాల రీసర్వే ప్రక్రియ పూర్తయిందన్నారు. ప్రస్తుతం రెండో దశలో 54 గ్రామాల్లో సర్వే ప్రక్రియ జరుగుతోందన్నారు. ఆయా గ్రామాల్లో ఇప్పటి వరకు 1.35 లక్షల ఎకరాల భూముల రీసర్వే చేశామన్నారు. భూములను సర్వే చేపట్టి ప్రభుత్వ, పట్టా, ఇనామ్ తదితర భూముల వివరాలను నమోదు చేస్తున్నామన్నారు. రీసర్వే జరిగిన 118 గ్రామాల నుంచి భూ సమస్యలు లేదన్నారు. పారదర్శకంగా రీసర్వే పూర్తి చేస్తున్నామని, తద్వారా భూములకు సంబంధించి హద్దులు, పట్టా భూములు ఎంత, ప్రభుత్వ భూములు ఎన్ని ఎకరాలు ఉన్నాయో పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. రీసర్వేకు రైతులు నగదు చెల్లించాల్సిన అవసరం లేకుండానే ఉచితంగా భూసమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నా రు. భూముల విషయాల్లో అక్రమాలకు పాల్పడే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

జిల్లా వ్యాప్తంగా వచ్చే నెల చివరి వారం నుంచి ధాన్యం కోతలు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. ముందస్తుగా 124 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, వాటి ద్వారా 1.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పంట పూర్తిస్థాయిలో దిగుబడులు వచ్చే సరికి మరిన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ధాన్యం విక్రయాల్లో రైతులు నష్టపోకుండా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 140 రైస్ మిల్లులు ఉన్నాయన్నారు. రైస్ మిల్లర్లు, దళారులు కుమ్మక్కై ధాన్యం ధరలు తగ్గించకుండా అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ఇతర జిల్లాల రైస్‌మిల్లర్లను ఆహ్వానించి ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి ఏడాది ధాన్యం కోతలు ప్రారంభమైన తర్వాత ధరలు తగ్గిస్తున్నారన్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారన్నారు. రైతులు ధాన్యం పీపీసీల్లో విక్రయించి రైస్‌మిల్లుల వద్ద రోజుల తరబడి ఉండాల్సిన అవసరం లేదన్నారు. ధాన్యం రైస్‌మిల్లుకు చేర్చే బాధ్యత కూడా లేదన్నారు. ధాన్యం సేకరణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ధాన్యం విక్రయించిన రైతుల బ్యాంకు అకౌంట్లో నగదు జమవుతుందన్నారు. ప్రభుత్వం క్వింటా ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,060, కామన్ రకానికి రూ.2,040 మద్దతు ధర ప్రకటించిందన్నారు. మద్దతు ధరకు తగ్గకుండా రైతులు ధాన్యం విక్రయించుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీఎంఆర్‌కు సంబంధించి గతంలో రైస్‌మిల్లర్లు పాత బకాయిలు రూ.80 కోట్లు ఉన్నాయన్నారు. పాత బకాయిలు ఉన్న రైస్‌మిల్లర్లకు నోటీసులు ఇచ్చి డిఫాల్టర్ల కింద నమోదు చేస్తామని తెలిపారు. పాత బకాయిలను పూర్తి స్థాయిలో వసూలు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ధాన్యం సేకరణకు సంబంధించి మొదటి శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యాయన్నారు. రెండో దశ క్షేత్రస్థాయిలో శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. ధాన్యం సేకరణకు సంబంధించి మండలాల్లో తహసీల్దార్లు, సీఎస్‌డీటీలు ఉన్నారన్నారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడ్ చేయడానికి ఇతర ప్రక్రియల పర్యవేక్షణకు ప్రత్యేక ఉద్యోగులను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

జిల్లా సెబ్ అధికారి శ్రీలక్ష్మి చిత్తూరుకు బదిలీ

- కర్నూలు ఏసీ నెల్లూరుకు..



కె. శ్రీనివాసాచారి



కె. శ్రీలక్ష్మి

నెల్లూరు (క్రైమ్): జిల్లా సెబ్ అధికారి కె.శ్రీలక్ష్మి చిత్తూరు సెబ్‌కు బదిలీ అయ్యారు. కర్నూలు అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె. శ్రీనివాసాచారి నెల్లూరుకు జిల్లాకు బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో సెబ్ భౌగోళిక స్వరూపాన్ని మారుస్తూ గతేడాది డిసెంబర్ 28న రాష్ట్ర డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 18 జిల్లాలకు ఏఎస్పీలను, 8 జిల్లాలకు అసిస్టెంట్ కమిషనర్లను డీఎస్‌ఈఓలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు అసిస్టెంట్ కమిషనర్ పరిధిలోకి మారింది.

రెండేళ్లకు పైగా...

బదిలీపై చిత్తూరు వెళ్తున్న కె.శ్రీలక్ష్మి జిల్లాలో 26 నెలల పాటు సమర్థవంతంగా విధులు నిర్వహించారు. ప్రభుత్వ లక్ష్యాలకు తూట్లు పొడిచే అక్రమార్కులపై ఉక్కుపాదం మోపారు. అనధికార మద్యం విక్రయాలు, పొరుగు మద్యం, నాటుసారా తయారీ, విక్రయాలు, ఇసుక అక్రమ రవాణా, గంజాయి అక్రమరవాణా, విక్రయాలు, గుట్కా తదితరాలపై నిరంతర దాడులు నిర్వహించి అక్రమార్కులను కటకటాల వెనక్కి పంపారు. మునుపెన్నడూ లేనివిధంగా పదేపదే నేరాలకు పాల్పడుతోన్న ముగ్గురిపై పీడీయాక్ట్‌ను ప్రయోగించారు. నెల్లూరు జిల్లాను సారారహిత జిల్లాగా మార్చేందుకు విశేష కృషి చేశారు. సారా తయారీదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించారు.

ఏసీ సైతం జిల్లాకు సుపరిచితులే..

కర్నూలు జిల్లా నుంచి బదిలీపై వస్తున్న కె. శ్రీనివాసాచారి జిల్లాకు సుపరిచితులే. 1996లో సీఐగా ఎక్సైజ్ శాఖలో బాధ్యతలు చేపట్టిన ఆయన అధిక కాలం జిల్లాలో సీఐగా, ఏఈఎస్‌గా, ఈఎస్‌గా పనిచేశారు. 2020లో అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి పొంది నెల్లూరులోనే బాధ్యతలు చేపట్టారు. 2021 జూన్‌లో కర్నూలు ఏసీగా బదిలీ అయ్యారు. ఇకపై ఆయన నెల్లూరు డీఎస్‌ఈఓగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

- అన్ని జబ్బులకు ఆరోగ్యశ్రీతో చికిత్స
- ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రత్యేకాధికారి అశోక్‌బాబు

నెల్లూరు(అర్బన్) : పేద ప్రజలకు ఖరీదైన కార్పొరేట్ వైద్యం అందించి వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రాష్ట్ర స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ అశోక్‌బాబు పేర్కొన్నారు. నగరంలోని దర్గామిట్టలో ఉన్న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి ఆయన శనివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ కాలంలో 1,057 జబ్బులు ఆరోగ్యశ్రీలో ఉండగా ప్రస్తుత ప్రభుత్వం 3,225 జబ్బులను ఆరోగ్యశ్రీలో చేర్చిందన్నారు. ఎంఆర్ఐ, సీటీ స్కాన్ లాంటి ఆధునిక వైద్యపరికరాలు అన్ని ఆస్పత్రుల్లో ఏర్పాటు చేశామన్నారు. మూడేళ్లలోనే 40 వేల మందికి పైగా డాక్టర్లు, వైద్యసిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.7 వేల కోట్లకు పైగా ఖర్చుచేసి 34 లక్షల మందికి వైద్యసేవలందించినట్లు వివరించారు.



మాట్లాడుతున్న డాక్టర్ అశోక్‌బాబు తదితరులు

పలు ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు

డాక్టర్ అశోక్‌బాబు మాట్లాడుతూ తాము ఇప్పటికే ఐదు ప్రైవేట్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులను తనిఖీ చేశామన్నారు. కొన్నిచోట్ల పరీక్షలకు ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపుతున్నారని గుర్తించామన్నారు. అలాగే నిబంధనలు సక్రమంగా పాటించని ఆస్పత్రులను గుర్తించామని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసి అపరాధ రుసుం విధిస్తామన్నారు. సమావేశంలో ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా మేనేజర్ వెంకటమురళీ, ప్రొఫెసర్ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

శాలివాహనుల సమస్యల పరిష్కారానికి సీఎం కృషి

- కార్పొరేషన్ సభ్యులుగా నలుగురికి నియామక పత్రాలు

నెల్లూరు(అర్బన్) : రాష్ట్రంలోని శాలివాహనుల(కుమ్మరి) సమస్యల పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఏపీ కుమ్మరి/శాలివాహన వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.పురుషోత్తం తెలిపారు. ప్రభుత్వం శాలివాహన కార్పొరేషన్‌కు జిల్లాలో నలుగురు సభ్యులను నియమించింది. సభ్యులు పొనగంటి శ్రీనివాసులు, పి.వెంకటలక్ష్మి, ఆర్.మనోహర్, మేడపు మాలకొండరాయుడులతో కలిసి శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ చక్రధర్‌బాబును కలిశారు. కలెక్టర్ ద్వారా సభ్యులకు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకాన్ని కుమ్మరులకు వర్తింపజేయాలని, టీటీడీ వద్ద ప్లాస్టిక్ కప్పులను నిషేధించినందున తమ కులస్తులు చేసే మట్టికప్పులు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, రామాయణాన్ని తెలుగులో రచించిన మొల్ల జయంతిని ప్రభుత్వ పరంగా నిర్వహించాలని కోరామన్నారు. ఇందుకు సీఎం సుముఖంగా చర్యలు చేపట్టారని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వీరు బీసీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మానందరెడ్డిని, బీసీ సంక్షేమశాఖాధికారి వెంకటయ్యను కలవగా వారు అభినందించారు.




కలెక్టర్ నుంచి నియామక పత్రాలు అందుకుంటున్న శాలివాహన కార్పొరేషన్ సభ్యులు, చైర్మన్

ఇన్‌చార్జి టీజీపీ స్పెషల్ కలెక్టర్‌గా సువర్ణమ్మ

నెల్లూరు(అర్బన్) : ఆత్మకూరు ఎస్‌డీసీగా పనిచేస్తున్న సువర్ణమ్మను తెలుగుగంగ ప్రాజెక్టు ఇన్‌చార్జి ప్రత్యేక కలెక్టర్‌గా నియమిస్తూ కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పనిచేస్తున్న టీజీపీ ప్రత్యేక కలెక్టర్ ఎమ్వీ సుధాకర్ సెలవుపై వెళ్లడంతో ఆమెను ఇన్‌చార్జిగా నియమిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

మాలకొండస్వామి సేవలో ఎస్పీ



స్వామి దర్శనానంతరం వస్తున్న ఎస్పీ

వలేటివారిపాలెం : మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని జిల్లా ఎస్పీ విజయారావు శనివారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ కార్యనిర్వాహణాధికారి కేబీ శ్రీనివాసరావు ఆహ్వానం పలకగా, ఆలయ ప్రధాన అర్చకుడు గౌరీశంకర్ ఎస్పీని స్వామి దర్శనానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేయించారు. దర్శనానంతరం ఎస్పీ విజయారావు మాట్లాడుతూ ఆలయ వాతావరణం బాగుందని, భక్తుల దర్శనానికి ప్రశాంతమైన వాతావరణం ఉండేలా చూడటం అభినందనీయమన్నారు. అన్నదాన ప్రసాదం రుచిగా ఉందని మెచ్చుకున్నారు.

తిప్పలో కార్డెన్ సెర్చ్

- పోలీసులు, సెబ్ అధికారుల సంయుక్త దాడులు

బిట్రగుంట : బోగోలు మండలం, కప్పరాళ్లతిప్పలో సెబ్ అధికారులు, పోలీసులు శనివారం భారీ స్థాయిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెబ్ డీఎస్పీ కృష్ణ కిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో కావలి, కందుకూరు, బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు సీఐలు, సిబ్బందితో కలిసి వేకువ నుంచే తనిఖీలు ప్రారంభించారు. సారా తయారీదారులు, విక్రేతలు, అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు చేశారు. సారా తయారీకి ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో కూడా దాడులు నిర్వహించారు. గతంలో సారా తయారు చేస్తూ పట్టుబడ్డ నిందితుల వివరాలను ఆరా తీశారు. సరైన పత్రాల్లేని ఎనిమిది ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. రెండేళ్ల తరువాత భారీ స్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తుండటంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. కాగా కార్డెన్‌సెర్చ్‌లో భాగంగా అధికారులు స్థానికులకు నాటుసారా దుష్పరిణామాలపై అవగాహన కలిగించారు. సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బైక్ చోరీ

- పోలీసుల అదుపులో నిందితుడు?

నెల్లూరు(క్రైమ్) : షాపు ముందు నిలిపిన బైక్ చోరీకి గురైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. గంటల వ్యవధిలోనే నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. రామకోటయ్య నగర్‌కు చెందిన గౌస్‌బాషా స్థానికంగా వెల్డింగ్ షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 27న ఆయన షాపు ముందు తన యూనికార్న్ బైక్‌ను పార్క్ చేసి లోపల పనులు చేసుకోసాగాడు. ఈక్రమంలో గుర్తుతెలియని దుండగుడు బైక్‌ను అపహరించుకుని వెళ్లారు. బైక్ కోసం బాధితుడు చుట్టుపక్కల గాలించాడు. ఫలితం లేకపోవడంతో శనివారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనా స్థలంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీపుటేజీలను పరిశీలించి నిందితుడ్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.